సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ; 18 ; జూలై ; 2024



9.838 టీఎంసీల నీరు నిల్వ

సోమశిల: జలాశయంలో బుధవారానికి 9.838 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 31 క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.77,320
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,906
3 శాతం జీఎస్టీతో	రూ.7,113
నవర (8 గ్రా)	రూ.56,904

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /28.9

జిల్లాలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పిడుగులు పడుతాయి. వాతావరణంలో తేమ 71 శాతం ఉంది.

న్యూస్‌రీల్

పక్కాగా కుష్టు సర్వే

నెల్లూరు(అర్బన్): జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమై వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటా లెప్రసీ (కుష్టు) సర్వేను ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమకు ఎవరికైనా శరీరంపై అసాధారణ రీతిలో నలుపు, తేనె, రాగి తదితర రంగుల్లో మచ్చలుంటే వైద్య సిబ్బందికి తెలిపి సర్వేకు సహకరించాలని కోరారు. అనుమానిత కేసులుంటే అటువంటి వారిని పీహెచ్‌సీ డాక్టర్ల వద్దకు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు.

పిచ్చికుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



కోవూరు : ఆరు బయట ఉన్న చిన్నారిపై రెండు పిచ్చి కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని చెర్లోపాళెంలో బుధవారం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం చిన్నారిని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా



విద్యుత్ స్టాల్‌ను పరిశీలిస్తున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బారాషహీద్ దర్గాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నిరంతరం అందేలా అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. దర్గా ప్రాంగణంలో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2000 కేవీఏ సామర్థ్యంతో పనిచేసే పది అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి డీఈ, ఏఈ స్థాయి అధికారులతో పాటు 187 మంది సిబ్బందిని నియమించామని వివరించారు. డీఈఈలు శ్రీధర్, కిరణ్, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భక్తజన సంద్రంగా మారిన స్వర్ణాల చెరువు

వరాల.. స్వర్ణాల

స్వర్ణాల చెరువు.. వరాలకు నెలవైంది. కోర్కెలు తీరిన భక్తులు వదిలే రొట్టెలు పట్టుకునేందుకు.. కొత్త కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు వచ్చిన భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. మతసామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండగ పటిష్ట ఏర్పాట్ల మధ్య బుధవారం ఘనంగా ప్రారంభమైంది. సింహపురిలో దారులన్నీ బారాషహీద్ దర్గా వైపే మళ్లాయి. కుల, మత వర్ణ భేదాలు లేకుండా తరలివచ్చిన భక్తులతో స్వర్ణాల పోటెత్తింది.

- విద్య, ఉద్యోగం, ధనం, వ్యాపారం, ఆరోగ్యం, సంతానం రొట్టెలకు డిమాండ్
- దర్గాలో బారాషహీద్‌లను దర్శించుకున్న భక్తులు
- రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తజనం

నెల్లూరు (బారకాసు): చదువు, ఉద్యోగం, పెళ్లి, సంతానం, ఆరోగ్యం, సౌభాగ్యం, ధనం, విదేశీ యానం, ఉద్యోగోన్నతి వంటి తమ కోరికలు తీరాలంటూ మతాలకు, కులాలకు అతీతంగా భక్తులు స్వర్ణాల బాట పట్టారు. మత సామరస్యాలకు ప్రతీకగా బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగ బుధవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. తొలి రోజు రాష్ట్ర నలుమూలల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చారు. స్వర్ణాల చెరువులో పుణ్య స్నానాలు ఆచరించి రొట్టెలు మార్పిడి చేసుకున్నారు. మతబోధకులైన యుద్ధవీరుల త్యాగనిరతిని స్మరిస్తూ సమాధులను దర్శించుకున్నారు.

స్వర్ణాల చెరువు వద్ద పక్కాగా ఏర్పాట్లు

బారాషహీద్ దర్గా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు పట్టుకొనే భక్తుల కోసం నగరపాలక సంస్థ అధికారులు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువు వద్ద భక్తులు తమకు కావాల్సిన రొట్టెను సులువుగా గుర్తించి పట్టుకొనేందుకు బోర్డులు ఏర్పాటు చేశారు. చెరువు లోతులోకి వెళ్లకుండా ఉండేందుకు చెరువులో కంచె, చెరువు ఘాట్ వద్ద నీటిని శుభ్రం చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు.

కోర్కెల రొట్టెలు.. పట్టుకున్న భక్తులు

నెల్లూరు సిటీ: కుల, మతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగకు విశిష్టత ఉంది. భక్తిభావంతో నమ్మకంతో తమ కోర్కెలు తీరాలని, మళ్లీ రావాలని రొట్టెలను ఇచ్చి.. పుచ్చుకుంటారు. తొలి రోజుల్లో ఒక రోజు జరిగిన ఈ పండగ.. భక్తుల్లో నమ్మకం ప్రబలడంతో జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో ఐదు రోజులుగా మారింది. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ పండగకు ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తింపు కల్పించింది. ఏటా పది లక్షల మంది తరలి వస్తుంటారు.

ప్రతి రొట్టెకు ప్రత్యేక ఘాట్

స్వర్ణాల చెరువులో సంప్రదాయబద్ధంగా స్నానమాచరించి.. రొట్టెలు ఇచ్చి పుచ్చుకోవడం ఆనవాయితీ. ఇందు కోసం ఏ కోర్కె రొట్టె ఎక్కడ దొరుకుతుందో అనే వెతుకులాటతో భక్తులు ఇబ్బంది పడకూడదని అధికారులు ప్రతి కోర్కె రొట్టెకు ప్రత్యేక ఘాట్ ఏర్పాటు చేశారు. భక్తులు ఏ కోర్కెతో వచ్చారో ఆ ఘాట్‌లోకి వెళ్లి తమకు కావాల్సిన రొట్టెను అందుకుంటారు. గతంలో తమ కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలను వదులుతారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, గృహం, సంతానం, ఆరోగ్యం, సౌభాగ్యం, విదేశీయానం, వివాహ, రొట్టెల బోర్డులను ఏర్పాటు చేశారు.



రొట్టెల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్

పెళ్లి, ఆరోగ్య రొట్టెలకు భలే డిమాండ్

రొట్టెల పండగకు వచ్చిన భక్తుల్లో అత్యధిక మంది పెళ్లి, ఆరోగ్య రొట్టెలను అందుకున్నారు. ఆ తరువాత స్థానంలో ఉద్యోగ, విద్య రొట్టెలు ఉన్నాయి. దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వర్ణాల చెరువు వద్ద కులమతాలకు అతీతంగా రొట్టెలు మార్చుకున్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి కోర్కెలు తీరాలని వేడుకున్నారు. కోర్కెలు తీరితే మళ్లీ రొట్టెలు వదులుతామని భక్తులు కోరుకున్నారు.



షహీదుల సమాధులను దర్శించుకునేందుకు బారులు తీరిన పురుషులు



దర్శనానికి బారులు తీరిన మహిళలు



సమాధులను దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో షహదత్, సొందల్‌మాలి

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగ తొలి రోజు సంప్రదాయంగా స్థానిక మత పెద్దల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 10 గంటలకు అమరులైన 12 మంది యోధులను స్మరిస్తూ దర్గా ప్రాంగణంలో బారాషహీద్‌ల సమాధుల చెంత షహదత్(ప్రత్యేక పూజలు) నిర్వహించారు. షహదత్‌లో భాగంగా 12 మంది వీరుల సమాధులను మత పెద్దలు రాత్రి 10 నుంచి 2 గంటల వరకు గులాములు, పన్నీరుతో శుభ్రం చేశారు. సంప్రదాయంగా గంధం లేపనం చేసి గలేఫాలు, చద్దర్లు కప్పి 'సొందల్ మాలి' కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. బారాషహీద్‌లకు నిర్వహించిన షహదత్, సందల్‌మాలిని భక్తజనం కనులారా వీక్షించి భక్తిపారవశ్యంతో పులకించిపోయారు.

గంధమహోత్సవం నేడు

బారాషహీద్ దర్గా రొట్టెల పండగలో అతి ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవం రెండో రోజు గురువారం రాత్రి నిర్వహించనున్నారు. పవిత్రమైన గంధాన్ని 12 పవిత్ర కలశాల్లో కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి సంప్రదాయంగా తీసుకొనివచ్చి బారాషహీద్‌లకు లేపనం చేస్తారు. అనంతరం భక్తులకు ఆ గంధాన్ని, ప్రసాదాన్ని పంచి పెడతారు. రొట్టెల పండగలో ఎంతో ప్రాధాన్యమైన ఈ ఘట్టాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గంధమహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు.



ఇసుక ఫ్రీ మస్కా


ఇసుక.. ఫ్రీ.. ఫ్రీ..ఫ్రీ అంటూ కూటమి ప్రభుత్వం జనానికి మస్కా కొట్టింది. పేరుకే ఉచితం.. కొంటే మోసం అర్థమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధానంపై తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ ఇప్పుడు తమ్ముళ్లకు దోచిపెట్టేందుకు జనం కళ్లల్లో 'ఉచిత ఇసుక' కొడుతోంది. గత ప్రభుత్వం ప్రతి ప్రాంతానికి దగ్గరగా, అనువుగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తే.. ఈ సర్కార్ మూడు కేంద్రాలు పెట్టి నిర్మాణదారులకు చుక్కలు చూపిస్తోంది. ఈ మూడు డిపోల్లో కూడా స్థానిక టీడీపీ నాయకులు చెప్పిందే వేదం. ఈ పరిణామంతో పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- పేరుకే ఉచితం.. అంతా మోసం
- గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2,800
- ఇప్పుడు రూ.3,850
- వినియోగదారుడిపై పెనుభారం
- మూడు రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా
- ఇసుక దొరక్క నిర్మాణదారుల అవస్థ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక ముక్కుపిండి దోపిడీ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇసుక విరివిగా, అందుబాటు ధరలో దొరికితే ప్రస్తుతం రోజుల తరబడి వేచి చూసినా, రూ.వేలు వెచ్చించినా దొరకడం లేదు. గత ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువగా ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ.. మరో వైపు రవాణా భారాన్ని మోపింది. గతంలో జిల్లా వ్యాప్తంగా 8 ఇసుక డిపోలు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం మూడు డిపోలనే కొనసాగిస్తోంది. దీంతో వినియోగదారులకు సకాలంలో ఇసుక దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ట్రాక్టర్ ఇసుక కొనాలంటే.. రూ.1,050 అదనపు భారం

ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధికారం చేపట్టక ముందే ఇసుక రీచ్‌లను స్థానిక నాయకులు ఎక్కడికక్కడ స్వాధీనం చేసుకుని అక్రమంగా ఇసుక తరలించి రూ. కోట్లు గడించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో టన్ను ఇసుక రూ.370గా నిర్ణయించి రూ.కోట్లు దండుకునే ప్రణాళిక రచించింది.



ఇసుక కోసం వేచి ఉన్న ట్రాక్టర్లు

ఒక ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. టన్ను రూ.370 వంతున 5 టన్నులకు రూ.1,850 రీచ్ దగ్గర వినియోగదారుడు చెల్లించాల్సి ఉంటుంది. మినగల్లు ఇసుక రీచ్ నుంచి బుచ్చిరెడ్డిపాళెంకు ట్రాక్టర్ బాడుగ రూ.2,000 వరకు వసూలు చేస్తున్నారు. గతంలో ఇదే రీచ్‌లో ఇసుక టన్ను రూ.475 ఉన్నా.. డోర్ డెలివరీతో కలిపి రూ.550 తీసుకునేది. ఈ లెక్కన 5 టన్నుల ఇసుక రూ.2,750లకు వచ్చేది. ఇప్పుడు ఒక ట్రాక్టర్ ఇసుక మినగల్లు నుంచి బుచ్చిరెడ్డిపాళెం చేరాలంటే రూ.3,850 అవుతుంది. అంటే ట్రాక్టర్ ఇసుక గతంతో పోల్చితే రూ.1,050 అదనంగా వినియోగదారులపై పడుతుంది. ఇక దూర ప్రాంతాలకు ట్రాక్టర్ బాడుగ ఎంత అడిగితే అంత ఇవ్వాల్సిందే. దీంతో పేదవారు ఇళ్లు కట్టుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

టిప్పర్లకు ప్రాధాన్యం.. ట్రాక్టర్లకు మొండిచేయి

మినగల్లు ఇసుక రీచ్‌లో టిప్పర్లకు మాత్రమే లోడింగ్ చేస్తున్నారని, ట్రాక్టర్లకు లోడ్ చేయడం లేదని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లు దూరం నుంచి వస్తున్నాయనే సాకుతో ఇలా చేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పూటే టిప్పర్లకు సీరియల్ కేటాయించి అవి రాత్రి నుంచే ఉన్నాయని నమ్మ బలికించి లోడు చేస్తున్నారు. ఉదయం పూట లోడుకు వెళ్లిన ట్రాక్టర్ యజమానులకు మధ్యాహ్నం లేదా సాయంత్రం రావాలని అక్కడి నిర్వాహకులు సూచిస్తున్నారు. ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ దూషణలకు దిగుతున్నారని ట్రాక్టర్ యజమానులు అంటున్నారు. ఉచిత ఇసుక పేరుతో రీచ్‌ల్లో టీడీపీ నాయకులు పెత్తనం చెలాయిస్తూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పైగా అందినకాడికి దోచుకోవాలని ప్రభుత్వంలో ఉన్న టీడీపీ కీలక నాయకులు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయలేక పోలీసులు, సెబ్ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

హామీని గాలికొదిలేశారు



ఎన్నికల హామీల్లో భాగంగా టీడీపీ అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా అందజేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రస్తుతం ఆ హామీని గాలికొదిలేశారు. గత ప్రభుత్వంలో రవాణా చార్జీలతో కలిపి తక్కువ ధరకే ఇసుక వచ్చేది. ఇప్పుడు ఇసుక కొనడం పేదలకు పెనుభారంగా మారింది. ఇసుక అందకుండా చేయడం సరైన పద్ధతి కాదు.

– బట్టా పాల్‌విల్సన్, బుచ్చిరెడ్డిపాళెం

పేదలపై పెనుభారం



ప్రస్తుత ప్రభుత్వంలో పేదలకు ఇసుక అందే పరిస్థితి కనిపించడం లేదు. పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. పేదలు టన్నుకు రూ.370, ట్రాక్టర్ బాడుగ కట్టి ఇసుక తెచ్చుకోవాలంటే పేదలపై పెనుభారం పడుతోంది. గత ప్రభుత్వం కంటే ధర తగ్గించామని చెబుతున్నా.. రవాణా చార్జీలు తడిసిమోపెడు అవుతున్నాయి.

– కె. సుమంత్, బుచ్చిరెడ్డిపాళెం

ఇసుక ఉచితంగా అందించాలి



మాలాంటి పేదలకు ఇసుక ఉచితంగా అందిస్తే ఇంటి నిర్మాణ ఖర్చు కొంత తగ్గే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ఇసుక ఇంటికి చేరాలంటే వేలల్లో ఖర్చు భరించాల్సి వస్తోంది. స్థానికులకు ఇసుక అందడం దుర్లభంగా మారింది. కొనడం ఒక ఎత్తైతే.. రవాణా భారం భరించలేనంతగా ఉంది. ప్రభుత్వం దీనిపై చర్చించి పేదలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలి.

– సీహెచ్ శ్రీనివాసులు, జొన్నవాడ

పొగాకు రైతుల విత్తన పాట్లు

ఆత్మకూరురూరల్/మర్రిపాడు: వర్జీనియా పొగాకు పండించే రైతులు నారుమడులకు విత్తనాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలోని డీసీపల్లి, కనిగిరి వేలం కేంద్రాల పరిధిలో సుమారు 3,500 మందికి పైగా పొగాకు బ్యారెన్ల లైసెన్సులు కలిగిన రైతులు ఉన్నారు. రాష్ట్రంలో పొగాకు విత్తనాల కోసం సీటీఆర్ఐ పరిశోధన సంస్థ రాజమండ్రి, కందుకూరులో మాత్రమే విత్తన విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో దూర ప్రాంతాల రైతులు తమకు కావాల్సిన పొగాకు విత్తనాల కోసం వ్యయ ప్రయాసాలు పడుతున్నారు. కందుకూరు సీటీఆర్ఐ కేంద్రంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల పరిధిలో దాదాపు 25 వేల మంది బ్యారెన్ లైసెన్సులు కలిగిన రైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక్కో బ్యారెన్ రైతుకు అర కిలో విత్తనాలు మాత్రమే పొందేందుకు పొగాకు బోర్డు నిర్ణయించడంతో నారుమడులు పోసే రైతులు సామూహికంగా పొగాకు బోర్డు పాసు పుస్తకాలతో వెళ్లి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. సొంతగా నారుమడులు పోసే రైతులు అర కిలో విత్తనాలకు రూ.500, వ్యాపారం కోసం నారుమడులు పోసే రైతులు కిలోకు రూ.1800 చొప్పున విత్తన విక్రయ కేంద్రంలో నగదు బదిలీ పద్ధతిలో చెల్లించి పొగాకు విత్తనాలను పొందాల్సి ఉంటుంది. నారుమడి వ్యాపారులు అయితే వేలం కేంద్రాల్లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ విధంగా కందుకూరు సీటీఆర్ఐ కేంద్రానికి వెళ్లి విత్తనాలు తెచ్చుకునేందుకు పొగాకు రైతులు పడే పాట్లు సంవత్సరాల తరబడి కొనసాగుతోంది. ప్రతి వేలం కేంద్రంలో సీజన్లలో పొగాకు విత్తన విక్రయాలు అందుబాటులో ఉంచితే వందలాది మంది పొగాకు రైతులకు సౌలభ్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



విత్తన విక్రయాలకు సాంకేతిక సమస్యలు



రాష్ట్రం మొత్తానికి పొగాకు విత్తన విక్రయ కేంద్రాలు రాజమండ్రి, కందుకూరులో మాత్రమే ఉన్నాయి. విత్తన సేకరణతో పాటు సంబంధిత సాఫ్ట్‌వేర్ ఆ కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండడంతో రైతులు విత్తనాల కోసం అక్కడికే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సాంకేతిక సమస్యల వల్ల వేలం కేంద్రాల వారీగా పొగాకు విత్తనాలు విక్రయించేందుకు అవకాశం లేదని సీటీఆర్ఐ ప్రతినిధులు చెప్పారు.

– రాజశేఖర్, డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి

వేలం కేంద్రాల్లోనే విత్తన విక్రయాలు చేపట్టాలి



ఒక బ్యారెన్ ఉన్న రైతుకు అర కిలో విత్తనాలు ఇస్తుంది. ఆ విత్తనాల కోసం 80 కి.మీ. దూరంలో ఉన్న కందుకూరుకు వెళ్లాల్సి వస్తోంది. డీసీపల్లి, కనిగిరి వేలం కేంద్రాల పరిధిలో రైతులకు కందుకూరుకు వెళ్లేందుకు నేరుగా బస్సు సౌకర్యం కూడా లేదు.

– రేవూరు నరసింహారెడ్డి, పొగాకు రైతు, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

20న పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సర్వ సభ్య సమావేశం ఈ నెల 20న శనివారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని టౌన్ హాల్లో ఉన్న వర్ధమాన సమాజంలో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, పి.వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లకు సంబంధించి అతి ముఖ్యమైన అంశాలు చర్చించాల్సి ఉందని, ఈ సమావేశానికి కార్యవర్గ సభ్యులు, తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తల్లి మందలించడంతో..

• బాలుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్‌): చదువుకోవాలంటూ తల్లి మందలించడంతో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మూలాపేటలో ఏకుమల్లై, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు డేవిడ్‌రాజ్‌ (13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం చదువుకోవాలని కుమారుడిని లక్ష్మి మందలించడంతో అతను మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు బాధిత తల్లి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.


అన్నదాన సత్రానికి వాటర్‌ కూలర్‌ వితరణ



రాపూరు: మండలంలోని పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని నిత్యాన్నదాన సత్రానికి కలువాయి మండలం మాదన్నగారిపల్లికి చెందిన పోతినేని వెంకటేశ్వర్లు, స్వర్ణ దంపతులు వాటర్‌ కూలర్‌ వితరణ చేశారు. వారు బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఏసీ సాగర్‌బాబుకు కూలర్‌ అందజేశారు. అలాగే శ్రీవారి ప్రసాదాలు నిల్వ చేసుకునేందుకు 30 క్రేట్లు ఇచ్చారు.

ఎందరున్నారో..!

• కుష్టు వ్యాధిపై నేటి నుంచి సర్వే
• 1,879 బృందాలతో ఇంటింటా పరిశీలన
• ముందస్తు గుర్తింపుతో నివారణ
• లేకుంటే ఇబ్బందులు





శరీరంపై మచ్చలు

నెల్లూరు(అర్బన్‌): కుష్టు వ్యాధి.. ఇది సోకిన వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటుంది. బాధితులు అందవిహీనంగా కనిపిస్తారు. కొంతమందికి రోగం ముదిరి చీము, నెత్తురు కారుతుంది. మరి కొందరికి శరీర భాగాలైన చేతి, కాలివేళ్లు కొరుక్కుని పోయి దివ్యాంగులుగా మారుతారు. ఈ వ్యాధికి కారణమైన సూక్ష్మక్రిములు వల్ల ఇంకొందరికి కాలు, చేయి ఉండవు. ఇలాంటి వారు సమాజంలో మిగిలిన వారితో కలిసిపోలేక ఆత్మన్యూనతకు గురవుతారు. ఒకవేళ కలిసి ఉందామన్నా సాటి మనుషులే దూరం పెడుతున్న సందర్భాలున్నాయి. దీంతో అత్యంత బాధాకర హృదయంతో ఊరికి దూరంగా నివాసం ఉండాల్సిన పరిస్థితి. ప్రధానంగా భిక్షాటనే ధ్యేయంగా.. ప్రభుత్వ పథకాలే ఆధారంగా జీవితమంతా భారంగా బతుకుబండిని లాగిస్తున్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైద్యం ద్వారా నయం చేయొచ్చు. లేకుంటే జబ్బు ముదిరి అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు గురువారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుడుతున్నారు.

దీని ద్వారా..

హాన్సెన్స్‌ వ్యాధిగా పిలిచే కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే సూక్ష్మజీవి ద్వారా శరీరంలో ప్రవేశిస్తుంది. ప్రధానంగా చర్మంపై ఇది ప్రభావం చూపుతుంది. పుండ్లు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా మెదడు, వెన్నుపాము వెలుపల ఉన్న నరాలను ప్రభావితం చేస్తుంది. కళ్లు, ముక్కు లోపల ఈ బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంది. కుష్టులో ట్యూబర్‌కులోయిడ్‌ లెప్రసీ, లెప్రోమాటస్‌ లెప్రసీ, బోర్డర్‌ లైన్‌ లెప్రసీ, పాసిబాసిల్లరి, మల్టీబాసిల్లరి ఉన్నాయి.

లక్షణాలిలా..

శరీరంపై కాస్త పెద్ద సైజులో తేనె, నలుపు, లేత తెలుపు రంగుల్లో మచ్చలుండి.. అక్కడ గిల్లితే స్పర్శ లేకపోవడం లాంటి లక్షణాలుంటే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. జబ్బు ఉందని ప్రాథమికంగా గుర్తిస్తే చిన్న వైద్యంతోనే వ్యాధిని రాకుండా చూసుకోవచ్చు.

ఇలా వచ్చే అవకాశం

కుష్టు అత్యంత బలహీనమైన అంటువ్యాధి. తుమ్మినా, దగ్గినా గాలి ద్వారా పక్క వ్యక్తికి ఇది రావొచ్చు. శరీర ద్రవాల ద్వారా ఇంకో వ్యక్తికి వచ్చే అవకాశముంది. అయితే ఈ వ్యాధి అంత త్వరగా ఒకరి నుంచి మరొకరికి సోకదు. దీర్ఘకాలికంగా కుష్టు వ్యాధి ఉన్న వ్యక్తితో సన్నిహితంగా కలిసి ఉంటేనే వస్తుంది. ఇలా సోకిన వారిలో త్వరగా బయటపడదు. మూడు నుంచి ఐదేళ్ల కాలం పట్టొచ్చు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఇప్పటికే 1,034 స్వల్ప, మధ్య, తీవ్ర శరీర లోపాలున్న కుష్టువ్యాధి కేసులున్నాయి. 2024లో కొత్తగా వ్యాధి సోకిన 99 మంది చికిత్స తీసుకుంటున్నారు. శరీర లోపాల తీవ్రత ఎక్కువగా ఉన్న 652 మందికి అధికారులు పింఛన్లు ఇస్తున్నారు. ఒక్కొక్కరు నెలకు రూ.6 వేల వంతున అందుకుంటున్నారు. వీరికోసం నెల్లూరు రూరల్‌ మండలంలోని ఆమంచర్ల గ్రామం వద్ద సేవాజ్యోతి, బెస్తెజ అనే రెండు కాలనీలున్నాయి. అలాగే రాపూరులో నజరత్‌ లెప్రసీ అనే పేరు మీద మరో కాలనీ ఉంది. వైద్యశాఖ సంవత్సరానికి రెండుసార్లు చెప్పులు అందజేస్తోంది. 307 మందికి పాదాలకు సంబంధించిన పరికరాలు ఇచ్చింది. ఎనిమిది మందికి సపోర్టు కర్రలిచ్చారు. అలాగే మరికొంతమందికి వాకర్స్‌, హ్యాండ్‌స్టిక్స్‌, కళ్లద్దాలు లాంటివి పంపిణీ చేశారు. అప్పుడప్పుడు స్వచ్ఛంద సంస్థలు వారికి తమ వంతు సాయం చేస్తున్నాయి. 2022లో 29 మందికి ఆపరేషన్లు చేయగా వారు తమ పనులు చేసుకోగలుగుతున్నారు.

సర్వే విజయవంతానికి సహకరించాలి



దశాబ్దాలుగా చేపట్టిన ఆరోగ్య రక్షణ చర్యల వల్ల జిల్లాలో కుష్టు వ్యాధి చాలావరకు నియంత్రణలోకి వచ్చింది. అతి తక్కువ కేసులు మాత్రమే ఉన్నాయి. గురువారం మొదలయ్యే సర్వేని ప్రజలు విజయవంతం చేయాలి. శరీరంపై ఎక్కడైనా నల్లటి, లేత తెలుపు, తేనె, రాగి తదితర రంగుల్లో పెద్ద మచ్చలుండి స్పర్శ లేకుంటే సర్వే సభ్యులకు సమాచారం ఇవ్వాలి. వారు పరిశీలించి అవసరమైన వైద్య సాయం అందిస్తారు. తద్వారా కుష్టురహిత సమాజాన్ని నిర్మించవచ్చు.

– డాక్టర్‌ ఖాదర్‌వలీ, అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ, జిల్లా కుష్టు నియంత్రణ అధికారి

సర్వేకు శ్రీకారం

కుష్టు వ్యాధిపై గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే చేయనున్నారు. ఇందుకోసం 1,879 బృందాలను అధికారులు ఏర్పాటు చేశారు. వారిలో ఆశా కార్యకర్త (మహిళ), సిబ్బంది ఉంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు వచ్చే నెల రెండో తేదీ వరకు ఈ సర్వే జరగనుంది. ప్రతి ఇంట్లో ప్రతి మనిషిని సర్వే చేయనున్నారు. ఎక్కడైనా స్పర్శ లేని మచ్చలున్నట్లు గుర్తిస్తే తక్షణమే పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ పర్యవేక్షణలో సంబంధిత వైద్య పరీక్షలు చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రత్యేకంగా వైద్యం చేయిస్తారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.55
సన్నవి : రూ.38
పండ్లు : రూ.28



రొట్టెల పండగకు పటిష్ట భద్రత

• ఎస్పీ కృష్ణకాంత్‌



స్వర్ణాల ఘాట్‌ వద్ద జనం

నెల్లూరు(క్రైమ్‌): రొట్టెల పండగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ వెల్లడించారు. బందోబస్తు నిమిత్తం 2 వేలమంది సిబ్బందిని నియమించామన్నారు. బుధవారం ఆయన దర్గా ఆవరణలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. తాత్కాలిక కమాండ్‌ కంట్రోల్‌ పనితీరును స్వయంగా వీక్షించారు. ఏ తరహా, ఎంత సామర్థ్యం కలిగిన సీసీ కెమెరాలను ఉంచారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో క్రైమ్‌ పార్టీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మఫ్టీలో తిరుగుతూ నేరాలు జరగకుండా చూడాలన్నారు. నేరనియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను పబ్లిక్‌ అడ్రస్సింగ్‌ సిస్టం ద్వారా భక్తులకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆయన దర్గా క్యూలైన్లు, రొట్టెల మార్పిడి, పార్కింగ్‌ ప్రదేశాలను పరిశీలించారు.పోలీసు సిబ్బంది, అధికారులకు కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన భోజన సదుపాయాల గురించి ఆరాతీశారు. ఆయన వెంట ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలున్నారు.

తనిఖీ చేసి..

మహిళలు, చిన్నారుల రక్షణ నిమిత్తం స్వర్ణాల చెరువు ఘాట్‌, దర్గా ఆవరణలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. దర్గా ప్రవేశద్వారం వద్ద మెటల్‌ డిటెక్టర్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోనికి పంపుతున్నారు. ఏడు పీటీజెడ్‌ కెమెరాలు, 54 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లను పోలీసు అవుట్‌ పోస్టులోని తాత్కాలిక కమాండ్‌ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. పోలీసు అధికారులు అక్కడి నుంచి నిరంతర పర్యవేక్షణ సాగిస్తూ సిబ్బందికి సూచనలు, సలహాలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం పోగొట్టుకున్న బ్యాగ్‌ను సీసీఎస్‌ పోలీసులు గుర్తించి వారికి అందజేశారు. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. రద్దీ దృష్ట్యా తప్పిపోయిన 92 మంది చిన్నారులను సంరక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్‌



పోలీసు అవుట్‌ పోస్టు వద్ద తప్పిపోయిన చిన్నారులు

పెనుశిల లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి క్షేత్రోత్సవం నిర్వహించారు.

చిల్లకూరులో రొట్టెల పండగ రేపు

• దో షహీద్‌ దర్గాలో ఏర్పాట్లు పూర్తి



చిల్లకూరులోని దర్గా

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులోని దో షహీద్‌ దర్గాలో శుక్రవారం రొట్టెల పండగ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఈ దర్గాకు ఎంతో చరిత్ర ఉంది. సయ్యద్‌ మహ్మద్‌ షా, సయ్యద్‌ అహ్మద్‌ షా అనే సహోదరులిద్దరి తలలు గండవరం వద్ద తెగిపడగా మిగిలిన శరీరం గుర్రంపై చిల్లకూరుకు వచ్చినట్లు ఈ ప్రాంతవాసులు చెబుతుంటారు. బొబ్బిలికి చెందిన ఓ రాణి చెన్నైకి వెళ్తూ దారిలో చిల్లకూరులో సేద తీరిన సమయంలో ఆమె కలలో ఇద్దరు సహోదరులు కనిపించి తమకు ఇక్కడ దర్గా నిర్మించాలని కోరారని పెద్దలు వెల్లడిస్తుంటారు. దీంతో ఆమె దర్గా (సమాధులు) నిర్మించారు. నెల్లూరులో రొట్టెల పండగ మొదలైన తర్వాత దో షహీద్‌ దర్గాలోనూ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం పండగ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు దర్గా ముతవల్లీ జుబేద్‌ బాషా తెలిపారు. చెన్నై, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వెళ్లిన భక్తులు ఇక్కడి దర్గాకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

పోలీసులూ.. ఇదేం తీరు



దర్గామిట్ట పోలీసుస్టేషన్‌ సమీపంలో మహిళను ఆపేసిన పోలీసు సిబ్బంది



పోలీసు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్న మహిళా భక్తురాలు

నెల్లూరు(క్రైమ్‌): నెల్లూరులో రొట్టెల పండగ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుతో స్థానికులు, దర్గాకు విచ్చేసిన ఇతర ప్రాంతాల భక్తులు ఇబ్బందులు పడ్డారు. దర్గా వైపు వెళ్లే రహదారులను బారికేడ్లతో మూసివేయడంతో పొదలకూరు రోడ్డు సెంటర్‌, జేవీఆర్‌ కాలనీ, లక్ష్మీనరసింహపురం, అంబేడ్కర్‌ నగర్‌, బ్రహ్మానందపురం, బట్వాడిపాలెం సెంటర్‌ తదితర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. తమ ఇళ్లు ఇక్కడేనని చెబుతున్నా పట్టించుకోకుండా వాహనాలను నిలిపివేశారు. దీంతో అనేకమంది పోలీసుల వ్యవహారశైలిపై అసహనం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ నగర్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ తన కుమార్తెతో కలిసి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా దర్గామిట్ట పోలీసుస్టేషన్‌ సమీపంలో విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. తన ఇల్లు అక్కడేనని సదరు మహిళ చెబుతున్నా పట్టించుకోలేదు. దీంతో ఆమె కన్నీరు పెట్టుకోవడంతో అనుమతించారు.

ఇక్కడిలా..

దర్గాను సందర్శించుకునేందుకు విచ్చేసే పురుషులు, మహిళల కోసం వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో ఉండి దర్గాలోకి వెళ్తున్నారు. కాగా విధుల్లో ఉన్న కొందరు పోలీసు సిబ్బంది తమకు తెలిసిన వారిని, ఉన్నతాధికారుల సిఫార్సు ఉన్నవారిని క్యూలైన్ల మధ్యలో నుంచి పంపడంతో భక్తులు అడ్డుకుని వారిని బయటకు పంపివేశారు. సిబ్బంది నచ్చజెప్పి సిఫార్సుతో వచ్చిన వారిని తిరిగి క్యూలైన్లలోకి పంపేందుకు యత్నించినా వారు ససేమిరా అనడంతో మిన్నకుండిపోయారు.

స్తంభించిన ట్రాఫిక్‌

తొలిరోజైన బుధవారం దర్గాకు భక్తుల తాకిడి అధికంగా ఉంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలివస్తున్నారు. వాహనాల రద్దీ పెరగడంతో నగరంలోని చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ స్తంభించింది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు



బ్రాయిలర్‌ (లైవ్‌)	: 130
లేయర్‌ (లైవ్‌)	: 110
బ్రాయిలర్‌ చికెన్‌	: 234
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 260
లేయర్‌ చికెన్‌	: 187

దొంగల హల్‌చల్‌

• ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు చోరీ
• పలు గృహాల్లోనూ నగదు అపహరణ

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్‌ చేశారు. అమ్మవారి ఆలయంలో, పలు గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. దొంగలు నాగారప్పమ్మ ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి నగదు అపహరించుకెళ్లారు. గ్రామానికి చెందిన మెట్టెం మాధవ అనే వ్యక్తి ఆరుబయట నిద్రపోతున్నాడు. దొంగలు అతని ఇంటి తలుపులు తీసి కూలర్‌పై ఉన్న మొబైల్‌ ఫోన్‌ చోరీ చేశారు. రజకవీధిలోని యాదగిరి మల్లికార్జున అనే వ్యక్తి ఇంటి ముందు నిలిపి ఉన్న మోటార్‌బైక్‌ను తీసుకెళ్లారు. మెట్టెం కొండయ్య ఇంట్లోకి ప్రవేశించి గోడకు తగిలించిన చొక్కా జేబులోని రూ.8 వేల నగదు, ఆండ్రావారిపల్లెలో ఆండ్రా లక్ష్మీరెడ్డి చొక్కా జేబులోని రూ.20 వేల నగదు చోరీ చేశారు. అలాగే వరికుంటపాడు జాతీయ రహదారి పక్కనున్న ఆండ్రా బాలగురవారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. కర్ర సాయంతో కిటికీలో నుంచి చొక్కాను లాగి రూ.4 వేల నగదు అపహరించారు. బాధితులు బుధవారం ఉదయం గుర్తించి లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దొంగలు చెలరేగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అగ్రహారం వీధిలో..

ఉదయగిరి: పట్టణంలోని అగ్రహారం వీధిలో ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మొహర్రం సందర్భంగా మండలంలోని దాసరిపల్లెలో జరుగుతున్న కార్యక్రమానికి అగ్రహారం వీధికి చెందిన మహ్మద్‌ రియాజ్‌ తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం సాయంత్రం వెళ్లాడు. అతని ఇంటికి తాళం వేసి ఉండడాన్ని దొంగలు గమనించారు. అర్ధరాత్రి వెళ్లి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బుధవారం సాయంత్రం తిరిగి ఇంటికొచ్చిన రియాజ్‌ దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. బీరువాలోని లాకర్‌లో దాచిన రూ.20 వేల నగదు, జత బంగారు కమ్మలు, ఉంగరం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీస్‌